# జాబులు జవాబులు — శ్రీ శ్రీ

చేబ్రోలు మునిస్వామి, గుడివాడ.

ప్ర: దేశంలో అక్కడక్కడ భూస్వాములపై నక్సలైట్లు జరుపుతున్నదాడులపై మీ అభిప్రాయం ఏమిటి?

జ: అయ్యయ్యో. అక్కడక్కడ మాత్రమేనా అవి.

పి. రామారావు, రాజమండ్రి.

ప్ర: మీ "మహాప్రస్థానం లో "దేనికొరకు" అన్న దానిలో రెండవపద్యం శ్రీ హరివంశరాయ్ బచ్చన్‌కు అనువాదమా? "బుక్కులు" అన్న దాన్లో సుమిత్రనందన్ పంత్‌గారిని అనుకరించారా?

జ: "మహాప్రస్థానం" వ్రాసి దాదాపు 30 ఏళ్ళవుతోంది. అప్పట్లో మీరు పేర్కొన్న వాళ్ళిద్దరూ ఉన్నారనికూడా నాకు తెలియదు.

గుజ్జుల రవీంద్ర, భారతి, రజీయుద్దీన్.
హైదరాబాదు.

ప్ర: మీ ఒక కుమార్తె పేరు "లెనినా" అని విన్నాము. నిజమేనా?

జ: నిజమే. "లెనినా" అని పేరు.

కె. భాస్కరరావు ఎం. ఏ, తిరుపతి.

ప్ర: "దేశచరిత్రలు" కవితలో, ఇతరేతర శక్తులువేస్తే పడిపోయెను పేకమేడలై. పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను. అన్న పాదాలలో అతిశయోక్త్యలంకారం ఉన్నదా?

జ: లేదు. అది కేవలం స్వభావోక్తి. పేకమేడలై అన్న చోటమాత్రం ఉత్ప్రేక్ష.

టి. శ్యామ్‌చంద్రశేఖర్, వీరవాసరం.

ప్ర: 24 గంటల్లో 32 వేలమంది జన్మిస్తున్నారట. వీరికి విద్య చెప్పించాలంటే రోజూ 100 పాఠశాలలు నిర్మించాలట. మన పిల్లలు 6 కోట్ల 40 లక్షలమందికి విద్య చెప్పించలేకపోతోంది. మన ప్రభుత్వం... కుటుంబ నియంత్రణమేనా, ఇక యేమార్గమూ లేదా?

జ: కుటుంబ నియంత్రణం అనేది పెట్టుబడిదారీ ప్రభుత్వాలు సూచించే పరిష్కారం. మన దేశంలో 90 శాతం సోమరిపోతులూ, నిరుద్యోగులూ, పరాన్న భుక్కులూ ఉన్నారు. వాళ్ళందరికీ సరియైన పని చూపిస్తే పాఠశాలలే కాదు. భూలోక స్వర్గాన్నే నిర్మించవచ్చు.

క్రొత్తపల్లి క్రాంతికుమార్, అమృతలూరు.

ప్ర: "అమీబా"తో పోల్చుకుంటే ఎలుక పెద్దది. ఎలుక్కంటే ఏనుగు. ఏనుగుకంటె కొండ; కొండకంటె సముద్రం, సముద్రంకంటె భూగోళం. భూగోళకంటె సూర్యగోళం; యింకా.. యింకా...లెక్కలేనన్ని సౌరమండలాలు ఊహకు కూడా అవకాశం ఇవ్వనంతటిదీ విశ్వసృష్టి!! "భగవంతుడనే వాడొకడున్నాడు. వాడే యీ సృష్టి కంతటికీ మూలం" అంటారు ఆస్తికులు... ఈ సృష్టికి మూలం ఏమిటి? ఎక్కడ?... అసలీ సృష్టంతా ఎందుకేర్పడింది? ఎలా ఏర్పడింది? నా భావనలోని బాధ అర్థమయిందనుకుంటాను. వివరంగా జవాబివ్వండి.

జ: ఇది చాలా పెద్ద ప్రశ్న. అంతేకాదు. ఇది ఇవాల్టిదీ నిన్నటిదీ కూడా కాదు. దీనికి సంతృప్తికరమైన జవాబు ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. నాకూ తరచు ఇలాటి బాధ కలుగుతూ ఉంటుంది. కాబట్టి మీ బాధ అర్థమయింది. ఆస్తికత్వం ఈ సమస్యల్ని పరిష్కరించలేదని మాత్రం చెప్పగలను. ఈలోగా ఒక చిన్న జోక్.

"ఇంకో 500 కోట్ల సంవత్సరాలలో ఈ భూమి మరో గ్రహంతో ఢీకొని నాశనమైపోతుంది" అని ఒక ఖగోళ శాస్త్రజ్ఞుడంటూ ఉండగా "సరిగా విన్నాను, ఎన్నేళ్ళో మళ్ళీ చెప్పండి" అని అడిగేడొక సామాన్యుడు.

శాస్త్రజ్ఞుడు - 500 కోట్ల సంవత్సరాలు!

సామాన్యుడు. హమ్మయ్య! రక్షించేరు. 5 కోట్లే అనుకున్నాను."

యస్. శ్యామ్‌సుందర్, వరంగల్.

ప్ర: దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెచ్చుపెరిగిపోతున్నది. దీనికి కారణం ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతులే అని నా అభిప్రాయం. మీరు నాతో ఏకీభవిస్తారా, లేక వ్యతిరేకిస్తారా?

జ: వ్యతిరేకిస్తాను. ఏనాడైతే ప్రజల ఓర్పు నశించిపోయి, బ్రతుకు దుర్భరం మౌతుందో ఆనాడు ప్రజలేతిరగబడి ప్రభుత్వాన్ని కూలదోస్తారు. ఇంకా మన ప్రభుత్వ పద్ధతులు ఆ మేరకు చేరుకోలేదు. కాని అటే ప్రయాణిస్తున్నాయి.

రావు, కే. ఈ., అనకాపల్లి.

ప్ర: తమిళనాడు మంత్రులు ప్రజలలోకివచ్చి సంతప్రీగా మన ఆంధ్ర మంత్రులు ఎందుకు ప్రజల మధ్యకు రాలేరు?

జ: తమిళ మంత్రులు ప్రజలలోంచి వచ్చారు కాబట్టి, ఆంధ్ర మంత్రులు ప్రజల నుంచి వెళ్ళిపోయారు కాబట్టి.

లక్కోజు సీలసంరాచార్యులు, పెనుగొండ.

ప్ర: "నట తపస్వి" శ్రీ సి. హెచ్. నారాయణరావుగారు తెర మరుగైనందుకు కారణం ఏమిటండీ?

జ: "కారె రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం జెందరే? వారేరి? ......"

"చక్రవర్తి", మాచర్ల.

ప్ర: మీరువ్రాసిన "చేదుపాట"లో "బ్రతుకు ... కరక్కాయ సుమీ" అంటూ వ్రాశారు. దీని అర్థ మేమిటండీ గురువుగరూ!

జ: మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూస్తూ కూడా నా పాట అర్థం కాలేదా? శిష్యోత్తమా!

"భరణి", విజయనగరం.

సాంప్రదాయ మగు చక్కని చిన్నది సాయంకాలం సినిమాకు వెళ్ళడం ఎందుకు? చీకటి మరుగున చేతులు వేశారని బాధపడడ మెందుకు?

జ: ఆ చిన్నదే మీరనుకుని ఆలోచిస్తే జవాబు దొరుకుతుంది.

యస్. సుబ్రహ్మణ్యం బి.కాం, బళ్ళారి.

ప్ర: మానవునికి జీవితంలో అన్నిటికన్నా ఎక్కువ సుఖం కలిగించునది ఏది?

జ: మృత్యువు మనదికాదు. మన విరోధులది.

వసల మాధవరావు, చిన్నవక్కపూడి.

ప్ర: ప్రతిఒక్కరు కవిత్వము వ్రాయగలరా?

జ: వ్రాయలేక పోవచ్చును. కాని అందరిలోను కవిత్వం ఉంది.

గంధం శేషేంద్రరావు, జి. చంద్రశేఖర్, మద్రాసు.

ప్ర: మీ మహాకవి కలంనుండి విప్లవాత్మకమైన వినూత్న పంథాలో ఒక ఆధునిక నవల వెలువడుతుందని విన్నాము. నిజమేనా?

జ: ఫిలిం ట్రీట్‌మెంటు పద్ధతిలో ఒక నవల రాద్దామని చాలా కాలంనుండి అనుకుంటున్నాను. అందులో సీక్వెన్సులే ప్రకరణాలు. "బెంగయ్యగారి గది" అనే మూ డంకాల నాటకం కూడా (సుమారు 3 గంటల ప్రదర్శనాకాలం గలది) వ్రాయాలని ఉంది.

మరువాడ సత్యమూర్తి, రాజమండ్రి.

ప్ర: నగ్నకవులపై తమ వ్యాఖ్యానం ఏమైనా వుందా?

జ: దిగంబర కవులని మీ ఉద్దేశం అయి వుంటుంది. వాళ్ళు దిక్కులనే ఆచ్ఛాదనంగా కప్పుకున్నారు కదా?

ఎ. రేణుకామనోహర్, ఆసిఫాబాద్.

ప్ర: మీరు సినిమాల్లో స్వరాన్ని అనుసరించి పాటరాస్తారా, లేక మీ పాట కనుగుణంగా బాణీ కూరుస్తారా?

జ: సంగతి సందర్భాలనుబట్టి రెండు విధాలుగాను ఉంటుంది. అయితే ఇటీవలి దాకా తెలుగు సినీకవులు స్వరాన్ని అనుసరించే వ్రాస్తూ వచ్చారు. ఇప్పుడిప్పుడు కవుల పాటలకి బాణీ కట్టడం ప్రారంభ మయింది. విశ్వనాథన్. మహాదేవన్ మొదలైన తమిళ మ్యూజిక్ డైరెక్టర్లు ఈ రెండో పద్ధతిని ప్రోత్సహిస్తున్నారు. యిందువల్ల మ్యూజిక్ డైరెక్టర్ల సృజనాత్మక ప్రతిభ మరింత ఎక్కువగా ప్రస్ఫుటమవుతోంది.

ఏ. యల్. శర్మ, బి. ఎ, (ఊరు?)

ప్ర: నేను మన ఇండియాలో డెమాక్రసీ నశించినది అని అంటాను. మీరే మంటారు?

జ: ఒకప్పుడుంటేకదా నశించడానికీ అని అంటాను.

వి. రమాకాంతం, కరీంనగర్.

ప్ర: మీరు ఇదివరకు సినిమాలలో ఎన్ని పాటలు వ్రాశారు?

జ: లెక్క చూసుకోలేదు. వెయ్యి దాటొచ్చు ననుకుంటాను.